క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

సీఎంకు కృతజ్ఞతలు

ఆత్మకూరు: ఒప్పంద అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు ఒప్పంద అధ్యాపకుల జేఏసీ కార్యదర్శి అబ్దుల్‌జబ్బార్ తెలిపారు. పట్టణంలోని బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయడానికి నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. దీంతో రాష్ట్రంలో వేల మంది కుటుంబాల్లో వెలుగులు నింపారని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివుడు, బాలకృష్ణ, రత్నకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నందికొట్కూరు: వైఎస్సార్ బీమా పేదలకు వరమని వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ బషీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశెట్టి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో నివాసముంటున్న షికారి బీమా అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా వర్తించడంతో కుటుంబ సభ్యులు షికారి పెద్ద సరస్వతికి తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. వలంటీర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీలు

మహానంది: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అంతర వ్యవసాయ కళాశాలల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ తెలిపారు. వ్యవసాయ కళాశాలలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 18 వ్యవసాయ కళాశాలల నుంచి 526 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. మూడో విడత పోటీల్లో భాగంగా క్రికెట్, ఫుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఎంఎస్ రాహుల్, డాక్టర్ శ్రీనివాసురెడ్డి పాల్గొన్నారు.

‘ఆడుదాం.. ఆంధ్ర’ క్రీడాపోటీలు వాయిదా

పగిడ్యాల: శుక్రవారం ప్రారంభం కావాల్సిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఈనెల 26కు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పది సచివాయాల పరిధిలో ఆడుదాం .. ఆంధ్ర క్రీడా పోటీలకు నమోదు చేసుకున్న క్రీడాకారులు క్రీడా నియమావళిని పాటించేలా గ్రామ స్థాయిలో వలంటీర్లు, మండల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతీ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నందికొట్కూరు రూరల్ : ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ శోభారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పని దినాల వేతనం రద్దు చేసి, కనీస వేతనం కింద రూ.26వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, హైమావతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీటీడబ్ల్యూఓ వెంకట శివ ప్రసాద్

మహానంది: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాలని నంద్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్ సూచించారు. మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులు పరిశీలించిన హాస్టల్ వార్డెన్ అంబమ్మకు పలు సూచనలు చేశారు.

వృత్తిలో నిలదొక్కుకునే‘లా’

- యువ న్యాయవాదులకు జగనన్న ఆర్థిక సాయం
- వైఎస్సార్ లా నేస్తం రెండో విడత జమ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న లాయర్లు



నందికొట్కూరు: ప్రజా సంకల్పయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు యువ న్యాయవాదులకు లా నేస్తం పథకంతో భరోసా కల్పించారు. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ వారు వృత్తిలో స్థిరపడేలా నెలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు తమకు తోడుగా నిలిచిన జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

డివిజన్ పరిధిలో 9 మందికి రూ.2.70లక్షలు జమ

జూలై 2023 నుంచి డిసెంబరు వరకు జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు చొప్పున ఒక్కొక్కరికి రూ.30వేలు ఈనెల 11న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాలకు నగదు జమ చేశారు. జిల్లాలో 98 మంది న్యాయవాదులకు రూ.29.40లక్షలు జమ చేశారు. ఇందులో నందికొట్కూరు నియోజకవర్గంలో ఇద్దరికి రూ.60,000, శ్రీశైలం నియోజకవర్గంలో ఏడుగురికి రూ.2.10లక్షలు విడుదల చేశారు.

ఆర్థిక తోడ్పాటు

న్యాయవాద పట్టా చేతపట్టి కళాశాల నుంచి బయటకు వచ్చిన యువ న్యాయవాదులు వృత్తి ఆరంభంలో కేసులు రాక అనేక ఒడిదొడుకులకు లోనవుతూ ఉంటారు. దీంతో కొందరు వృత్తిని వదిలి వెళ్లే పరిస్థితి. ఈ పరిస్థితుల్ని తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూనియర్ న్యాయవాదులకు వృత్తిపై ఆసక్తి పెంచేలా వారికి నెలకు రూ. 5 వేలు స్టైఫండ్‌గా అందించి చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టిన సీఎం లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హులైన యువ న్యాయవాదులకు మూడేళ్లపాటు నెలకు రూ. 5 వేలు చొప్పున ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 100 కోట్లు కార్పస్ ఫండ్‌తో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం పట్ల న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ న్యాయవాదులకు ప్రయోజనం



జూనియర్ న్యాయవాదుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని లా నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి నెల రూ. 5 వేలు స్టైఫండ్ చెల్లిస్తుండడంతో రాష్ట్రంలో వేల మంది జూనియర్ లాయర్లు ప్రయోజనం పొందుతున్నారు. నూతనంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులకు కొంత ఆర్థిక పరిపుష్టి కలిగడంతో ఇతర వృత్తుల వైపు వెళ్లకుండా ఈ వృత్తిలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

– అరుణ్‌కుమార్, న్యాయవాది, నందికొట్కూరు

ఆర్థిక సమస్యల నుంచి ఊరట



జూనియర్ న్యాయవాదులుగా వృత్తిపరంగా ఎదురయ్యే చిన్న చిన్న ఆర్థిక సమస్యలకు తట్టుకునేందుకు వైఎస్సార్ లా నేస్తం కింద నాకు ఆర్థిక సాయం అందుతోంది. ఇది అన్ని వర్గాలకు చెందిన న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ప్రాతకోట భాస్కర్ న్యాయవాది, ఆత్మకూరు కోర్టు

పుస్తకాలకు ఉపయోగిస్తా



లా నేస్తం పథకం నాకు ఎంతో ఆసరా నిలిచింది. ఈ పైసలు బుక్స్, పోటీ పరీక్షలు రాసేందుకు ఉపయోగపడతాయి. ఈ వృత్తిలో రాణించేందుకు ఈ స్కీమ్ మాకు కొండంత ధైర్యాన్ని నింపింది. జూనియర్స్‌కు చాలా ధైర్యంగా ఉంది.

– దివ్యజ్యోతి న్యాయావాది, నందికొట్కూరు

కుటుంబ సభ్యులపై భారం లేకుండా



పట్టా చేతపట్టి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన జూనియర్ న్యాయవాదులు తొలి నాళ్లలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటారు. న్యాయవాద వృత్తి ప్రారంభించిన లాయర్లు లైబ్రరీ, రవాణా, ఇతర అవసరాలకు కు టుంబ సభ్యులపై ఆధారపడకుండా యువ న్యావాదులకు ప్రభుత్వం లా నేస్తం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుంది.

– వెంకటరాముడు, బార్ అసోసియేషన్ సభ్యుడు, నందికొట్కూరు

అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యత అధికారులకు



మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ గత మూడు రోజులగా సమ్మె చేస్తున్న తరుణంలో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యత అధికారులు తీసుకోవాలని ఎంపీడీఓ మేరి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేలా విధులు కేటాయించామన్నారు. శుక్రవారం నుంచి సెంటర్లను తెరుచుకుంటాయని చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఏపీఎం, మహిళాపోలీసులు, వీఓఏలు పాల్గొన్నారు.

నేడు భూ సేకరణ బాధితులతో సమావేశం

డోర్నిపాడు: నంద్యాల-జమ్మలమడుగు ఎన్‌హెచ్167కె భూ సేకరణలో భాగంగా గుండుపాపల గ్రామానికి చెందిన భూమి, ఇళ్లు కోల్పోయిన బాధితులతో శుక్రవారం స్థానిక సహకార సంఘం ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పాన్ కార్డు, పొలం పట్టాదారు పుస్తకం, ఈసీ, ఆన్‌లైన్ ఆర్ఓఆర్, అడంగల్, రెండు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో సమావేశానికి రావాలని సూచించారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం



అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతు తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యనియన్ హెల్పర్స్ కార్యదర్శి మంజుల, నాయకురాళ్లు లక్ష్మీదేవి, ప్రమీల అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమాలు గురువారం కూడా కొనసాగించారు. ఏపీ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

వెలుగోడు: అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజు మండలంలో కొనసాగింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. ధర్నాకు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సీఐటీయూ మండల అధ్యక్షుడు వి.నాగమోహన్, పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

పగిద్యాల: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం మానవత్వంతో పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియ్యా, డివిజన్ ఉపాధ్యక్షుడు లాజరస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడు రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న నిరవదిక ధర్నాకు గురువారం వారు సంఘీభావం తెలిపారు.

జూపాడుబంగ్లా: తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు వెంకటరమణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించేవరకూ పోరాడుతామని అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఈ.హరిత, మండల నాయకురాళ్లు నాగమణి, రమణమ్మ, శ్రీదేవి, లలిత అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడవ రోజు సమ్మె నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి మొకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడుతూరు: మండలపరిధిలోని కలమందలపాడు గ్రామంలో గురువారం ఓ వ్యక్తి ఉరేసుకొని మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల మహమ్మద్ రఫి (42) కొంత పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంటల సాగుకోసం అప్పు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సరైన దిగుబడులు రాక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నూర్జహాన్‌బీ అంగన్‌వర్కర్‌గా పని చేస్తోంది. ఆమె విధులకు వెళ్లగా.. తల్లి మౌలాబీ ఇంటికి సమీపంలో కిరాణం కొట్టు నిర్వహిస్తోంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందిన కుమారుడిని చూసి భోరున విలపించింది. విషయం తెలుసుకున్న ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఇటీవల పెద్ద కుమార్తె వివాహం ఖరారైంది. ఇటువంటి తరుణంలో కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రేగడగూడురులో జొన్నపైరును పరిశీలిస్తున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. గురువారం రేగడగూడూరులోని జొన్న పైర్లను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. జొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రబీలో సాగుచేసిన పంటలను స్థానిక రైతు భరోసా కేంద్ర సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు చిన్న మౌలాలి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్లు



అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను గురువారం ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ కె. వెంకట నరసింహాచారి, ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ మల్లికార్జున, కమిషనర్ కె.రవికిరణ్‌లు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ షబ్బీర్ అహ్మద్

మహానంది: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్ అన్నారు. పార్నపల్లెలో గురువారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వాసుదేవ గుప్త, పార్నపల్లె ఉపసర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



డ్రోన్ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని తిమ్మాపురం, సుంకేసుల సర్పంచ్‌లు నాగస్వామిరెడి, ఇందిరమ్మ అన్నారు. గురువారం మండలపరిధిలోని తిమ్మాపురం, సుంకేసుల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంటల సాగులో రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీతో తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించాలని చెప్పారు. అనంతరం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు కేంద్ర పథకాలపై (ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన, జలజీవన్ మిషన్, పీఎం కిసాన్ కార్డులు) అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బయ్య, ఏపీఓ జయంతి, పంచాయతీ కార్యదర్శులు ఫరీద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జీడీఎస్ సమస్యలు పరిష్కరించాలి



నిరవధిక సమ్మెలో కూర్చొన్న ఉద్యోగులు

నందికొట్కూరు: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నందికొట్కూరు డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు శ్యామ్‌సుందర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పోస్టాఫీసు ఆవరణలో ఏఐజీడీఎస్‌వీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవదిక సమ్మె చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జీడీఎస్‌లకు సివిల్ సర్వేంట్ హోదా ఇవ్వాలని, 8 గంటల పని భారం కల్పించాలని చెప్పారు. పోస్టాఫీసు ఉద్యోగులకు 12, 24, 36 అదనపు సర్వీస్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు విజయకుమార్, శివకృష్ణ, గోపాల క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో అనర్థాలు



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న మనాశ్రీ దంపతులు

మహానంది: సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో కొంత ప్రయోజనం ఉన్నప్పటికీ అనర్థాలు అధికంగా ఉన్నాయని సినీగేయ రచయిత, కవిశేఖర మనాశ్రీ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబసభ్యులతో కలిసి గురువారం మహానంది వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు యువతీ యువకులు పెడదోవ పడుతున్నారన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సులో స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం భావ్యం కాదన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వివాహాలతో హింస జరిగే అవకాశం ఉందని మున్సిపల్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం ఫయాజుర్ రహీం అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో గురువారం బాల్య వివాహాలపై విద్యార్థులకు న్యూ బిగినింగ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు రిసోర్స్ మేనేజర్ ఓబులేసు, మహిళా పోలీసు మాధవి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి భావితరాలకు నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఈఈ రమణారెడ్డి అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తే వాతావణ కాలుష్యం అధికమవుతుందన్నారు. పగటి పూట వీలైనంత వరకూ కిటికీలు తెరచి లైట్లు, ఫ్యాన్ల వాడాకాన్ని తగ్గించాలన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగే ర్యాలీలో సంబంధిత ఉద్యోగులు, సిబ్బందితో పాటు వినియోగదారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈ ఆంథోనిరాజు, ఏఈలు రామయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


బసవపున్నయ్య సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన బసవపున్నయ్య సేవలు మరువలేనివని సీపీఎం పట్టణకార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహనాయక్, రజాక్ అన్నారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బసవపున్నయ్య 109వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, మాబాషా, సుధాకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ అధ్యక్షురాలిగా నాగసుప్రజ



నాగసుప్రజను సత్కరిస్తున్న టీజీ వెంకటేష్

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ అధ్యక్షురాలిగా బనగానపల్లెకు చెందిన నాగసుప్రజను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. తనను జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికున్నందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని పేద ఆర్యవైశ్య కుటుంబాలకు తనవంతుగా సహకారం అందిస్తానన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త, అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, నాగరాజు, సతీష్ కుమార్, ధనుంజయ, మురళీధర్ పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): కరువు మండలాల్లో రైతుల నష్టాలను గుర్తించి జాతీయ విపత్తుగా పరిగణించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రైతు సంఘం కో కన్వీనర్ సోమన్న, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని డోన్, ప్యాపిలి, కొలిమిగుండ్ల, సంజామల, నందికొట్కూరు, జూపాడుబంగ్లాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ధనుంజయుడు, శ్రీనివాసులు, పాములేటి, సుబ్బరాయుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంచాలి



ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఆత్మకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాయక్, రజాక్, రణధీర్‌లు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ప్రభుత్వం గౌరవ వేతనం పెంచాలని, 4వ తరగతి ఉద్యోగుల్లా వేతనాలు ఇవ్వాలన్నారు. పథకం నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే యోచనను విరమించుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ జానకీరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అహ్మద్‌బి, మేరమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

3జీ అవార్డు విచారణకు 325 మంది హాజరు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గోస్పాడు: 167కె నేషనల్ హైవే కోసం భూ సేకరణకు సంబంధించిన 325 మంది రైతులు గురువారం నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 3జీ అవార్డు విచారణకు హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 3జీ అవార్డు విచారణ స్థానిక తహసీల్దార్ విజయశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల పరిధిలో నంద్యాల-జమ్మలమడుగుకు నేషనల్ హైవే రహదారి 167కె ఏర్పాటుకు భూముల సేకరణ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల 10.903 ఎకరాలు, జూలేపల్లె 12.119 ఎకరాలు, పసురపాడు 20.929 ఎకరాలు, గోస్పాడు 32.454 ఎకరాలు, ఒంటివెలగల 16.959 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. ఇందులోని ఐదు గ్రామాల పరిధిలో 612మంది రైతులకు సంబంధించిన 93.164 ఎకరాల భూమి ఉందని వివరించారు. అందులో 325 మంది రైతులు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల రైతులు తమకు సంబంధించిన పూర్తిస్థాయి డాక్యుమెంట్లు సమర్పించగా వాటిని పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం భూమికి సంబంధించిన ధరలపై రైతులతో ఆర్‌డీఓ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు, సీనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.